# లోక విద్య ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-1, సంచిక-7 1మార్చి - 2014 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2

## అంబానీ, టాటాలకు దేశాన్ని అమ్మేయడాన్ని దేశభక్తులందరూ వ్యతిరేకించాలి

భారతదేశం అంటే దేశప్రజలు పర్వతాలు, భూములు, నదులు, సముద్రం, గాలి వీటన్నింటిలో నిక్షిప్తమైన సహజ వనరులన్ని కలిసి భారతదేశం. పూర్వం తెల్లవాడు భారతీయులందర్ని బానిసలుగా, కూలీలుగా మార్చాడు. ఈరోజు మనమందరం పెట్టుబడిదార్ల కంపెనీల్లో కూలీలుగానూ, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలుగానూ బ్రతుకు వెళ్లదీస్తున్నాం. ఆ రోజు తెల్లవాడు భారతదేశంలో లభ్యమయ్యే వనరులన్నీ ముడి పదార్థాలుగా వారి దేశాలకు తీసుకుపోయి వాటితో వస్తువులుగా తయారు చేసి, దాన్ని అధిక ధరలకు మనకే అమ్మారు. ఆవిధంగా తక్కువ ధరకు కొని కొనేటప్పుడు లాభం, అమ్మేటప్పుడు ఎక్కువ ధరకు అమ్మి అమ్మేటప్పుడు లాభం అర్జించారు. ఇప్పుడు మన భారత ప్రభుత్వం గాలిలోని శబ్ద తరంగాలను, భూమిలోని ఖనిజాలను, అడవిలోని ఉత్పత్తులను, సముద్ర గర్భంలోని సహజవాయువును అంబానీలకు, ఇతర పెట్టుబడిదారులకు అభివృద్ధి పేరుతో అప్పగిస్తోంది. సహజ వనరులను ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పేటప్పుడు బహిరంగ వేలంలో అమ్మాలనే సూత్రాన్ని మరచి శబ్ద తరంగాలను కొన్ని కంపెనీలకు పోటీలేకుండా ఇవ్వడంలో భారత ప్రభుత్వం సాలీనా లక్ష 76 వేలకోట్లు నష్టపోయిందని కాగ్ వారు నిగ్గు తేల్చిన సంగతి అందరికి తెల్సిందే.

ఇప్పుడు సహజవాయువు ఉత్పత్తిచేసి దాన్ని అమ్మి ప్రభుత్వం, పెట్టుబడిదారులు వారి యొక్క పెట్టుబడి తీసేయగా మిగిలిన లాభాలను పంచుకోవాలని ముందుగా నిర్ణయించారు. దాని ప్రకారం ఒప్పందాలను తయారుచేశారు. ఏ ప్రాంతంలో తయారుచేస్తున్నారో ఆ ప్రదేశమే కాకుండా, అమ్మే ప్రాంతం భారత ఉపఖండం అవడంతో రూపాయలలో రాస్తే సామాన్యుడికి అర్థమవుతుందని డాలర్లతో రాశారు. మొదట అంగీకార పత్రం ప్రకారం 1 ఎం.బి.టి.యు గ్యాస్ వెలికి తీసేందుకు 1.43 డాలర్లు ఖర్చవుతుందని అంచనావేసి భారత ప్రభుత్వానికి 2.34 డాలర్లకు అమ్ముతాయని అంబానీ భారతప్రభుత్వాల మధ్య 2000 సం॥ 17 ఏళ్ళ ఒప్పందం జరిగింది. ఇదే రేటుకు అనీల్ అంబానీ కంపెనీలకు, బంగ్లాదేశ్ ప్రభుత్వానికి కూడా ఈనాటికి అమ్ముతుండగా, భారత ప్రభుత్వానికి 4.2 డాలర్లకు 2007లోనూ, 2014లో 8.4 డాలర్లు గానూ భారత కేంద్ర ప్రభుత్వ ఉపమంత్రి మండలి వీరప్పమొయిలీగారి ఆధ్వర్యంలో పెంపును నిర్ణయించింది. ఈ ధరల పెంపకంవల్ల ముఖేష్ అంబానీకి లక్ష కోట్లపైగా లాభం వస్తోందని సి.ఎ.జి. (కాగ్) ప్రాథమిక అంచనాకు వచ్చారు.

ఈ అంచనాలకు రిలయన్స్ కంపెనీవారు పెట్టిన పెట్టుబడులు నిజమని చెప్పి ఎటువంటి ఆధారాలు లేకుండా కాగ్ వారు ఒప్పుకోవడం విడ్డూరం. 40 బిలియన్ల ఎం.బి.టి.యు గ్యాస్ ఉత్పత్తికి 2.5 బిలియన్ డాలర్లు ఖర్చయితే 80 బిలియన్ ఎం.బి.టి.యులకు 5 మిలియన్లు ఖర్చవుతుందని ఒకటవ తరగతి పిల్లవాడికి కూడా అర్థమౌతుంది. కానీ అది 8.8 బిలియన్ డాలర్లుగా రిలయన్స్ ప్రకటించింది. దీన్ని కాగ్ ఒప్పుకుంది. ఇంత పెట్టుబడి ఖర్చు ఎలా పెరిగిందంటే మార్కెట్లో రూ. 1-00 దొరికే బోల్టును అంబానీ వారు వేరే కంపెనీ నుండి 100 రూ.ల చొప్పున కొంటే ఖర్చు పెరిగిందని ఈ విధంగా 300 రూ॥లకు దొరికే సిలిండర్ ఖరీదు 1300 రూ॥లకు పెంచిన డబ్బులన్ని అంబానీకి చెల్లిస్తున్నాం మనం. అందుకే సహజవనరుల ద్వారా వచ్చే గ్యాస్ కంపెనీలను ప్రజాపరం చేస్తే 100 రూ॥లకే గ్యాస్ సిలిండర్ అందరికీ ఇవ్వచ్చు. కనుక బొగ్గు, గ్యాస్ మరియు ఇతర విద్యుత్, ఉత్పత్తి సహజ వనరులన్నీ ప్రజల ఆధీనంలో ఉంచడానికి ప్రభుత్వం వీటన్నిటినీ జాతీయకరించాలి. ఈ న్యాయమైన డిమాండ్‌ని ముందుకు తెచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ ఆలోచన మరింత ముందుకు తీసుకువెళ్ళాల్సిన అవసరం వుంది.

- టి. నారాయణరావు

**జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.**

## ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా కోసం నూతన రాజకీయాల ఆవశ్యకత

మన రాష్ట్రంతో సహా అరుణాచల్‌ప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, ఒరిస్సా, సిక్కిం శాసనసభ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికలు మూడు నెలల్లో జరగనున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో తీవ్రంగా నష్టపోతున్న లోకవిద్యాధర సమాజం అంటే రైతులు, గిరిజనులు, మహిళలు చేనేత వృత్తివారు, కమ్మర్లు, కుమ్మర్లు, చాకళ్ళు, మంగళ్ళు, మత్స్యకారులు, గీతకార్మికులు, వడ్రంగులు, కంసాలులు, చెప్పులు కుట్టేవారు, తోటపని వారు, దినసరి కూలీలు, సైకిళ్ళమీద, బళ్ళ మీద వారాంతపు సంతల్లోను, చిన్న గ్రామాల్లోను, పట్టణ కాలనీల్లోను, శివారుల్లోను వ్యాపారం చేసుకొనే వారందరూ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా కోసం ఆతృతగా ఎదురుచూడడం, అంతిమంగా ఇదే అభివృద్ధి నమూనాను బలపర్చే ప్రస్తుత రాజకీయ పార్టీలకు ఓటువేయడం, వారు కూడా లోకవిద్యాధర సమాజానికి ఏమాత్రం మేలుచేయకపోవడం గత 6 దశాబ్దాలుగా అనుభవిస్తున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ అభివృద్ధి రాజకీయాలను చర్చించడం నాగరిక సమాజంలో ప్రతి పౌరుడి విధి.

ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి ద్వారా వ్యక్తుల సంపద పోగుపడటం ఆశేష జనానికి ఈర్ష కలిగించేలా కొంతమంది వద్ద సంపద పోగుపడటంతో అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, తద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కైవసం చేసుకోవడం అందరికి తెలిసిందే. అవినీతి రహిత పరిపాలనతో పాటు, లోకవిద్యాధర సమాజంలో ఉన్న జ్ఞానాన్ని, పని నైపుణ్యాన్ని పరిశోధన్మాతక చొరవను గుర్తించి వీరందరికీ సమాజంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానమైన వేతనాన్ని ఇచ్చే నూతన రాజకీయ ప్రభుత్వ స్థాపనగా జాతి యావత్తూ చర్చించాలని లోకవిద్యజనాందోళన ఈ చర్చ ప్రారంభించింది.

ప్రతి సమస్యకు పరిష్కారాలు అనేకం. ఆ పరిష్కారాన్ని స్థానిక ప్రజా సమూహం గ్రామాల్లో, కాలనీల్లో, వారి తండాల్లో, వారి పల్లెల్లో చర్చించి స్థానిక ప్రజల జ్ఞానంతో ప్రణాళికలు రచించి ప్రత్యామ్నాయ అభివృద్ధిని అన్వేషించాలి. చదువుకున్నవారనో, ఇప్పటికే సమాజ సేవలో ఉన్నారనో వారితోటి చర్చించే పద్ధతికి స్వస్థిచెప్పి స్థానికంగా ఉండే ప్రతి పౌరుడు ఇచ్చే సలహాలు, సూచనలు మేరకే నిర్ణయాలు ఉండాలి. ఈ రోజు స్థానిక సంస్థల్లో ఏమి చర్చించాలనేది కేంద్ర ప్రభుత్వమో లేక రాష్ట్ర ప్రభుత్వమో, ఒక రాజకీయ పార్టీయో నిర్ణయం చేయడం పూర్తిగా తప్పు. ఎందుకంటే ప్రశాంతంగా స్వశక్తితో బ్రతికే లోకవిద్యాధర సమాజాన్ని, జ్ఞానాన్ని వెనుకబడిపోయిందని, మీరంతా వెనకబడినవారు, రాజధానుల్లో కూర్చుని ఆలోచించే మేము మీరందరికి పరిష్కారాలు చూపించగలము అంటూ అమలుచేసిన ప్రస్తుత అభివృద్ధి నమూనాలో చేతివృత్తిదారులు, రైతులు, గిరిజనులు, మహిళలు ఒకరేమిటి లోకవిద్యాధర సమాజంలో ప్రతిఒక్కరూ నష్టపోతున్నారు. ప్రస్తుత రాజకీయ పార్టీలవద్ద, ప్రభుత్వాల వద్ద ఈ సమస్యలకి ఏ పరిష్కారాలు లేవనే సంగతి అందరికి తెలిసిందే. అందుచేత లోకవిద్యాధర సమాజం తమ జ్ఞానాన్ని, అనుభవాన్ని రంగరించి తమ విముక్తికి తామే ప్రణాళికలు రచించుకోవల్సిన సమయం ఆసన్నమైంది.

ప్రస్తుత సమస్యల పరిష్కారాలకు లోకవిద్యాధర సమాజం విశ్వవిద్యాలయాల్లో చదివే శాస్త్రజ్ఞులు, మేధావుల మీద ఆధారపడితే వారికి విముక్తి లేదు. మనం త్రాగే నీటి దగ్గర నుండి మన ఆరోగ్యం, వ్యవసాయం, అడవులు, పరిశ్రమలు, పరిపాలన, కక్షిదారుల మధ్య తీర్పులు, వ్యాపార నియంత్రణ, రాజకీయాలు ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రంగాలలోను లోకవిద్యాధర సమాజం ఆలోచించే ప్రత్యామ్నాయాలే వారిని ప్రస్తుత అభివృద్ధి నమూనాలో ఉన్న దోపిడి నుండి విముక్తి పొందుతారు. ఒకనాటి ఇంజనీర్లు మాత్రమే చేసే విద్యుత్ పనులు, లోకవిద్యాధర సమాజ సభ్యులు చేయగల్గుతున్నారు. పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో చదవకపోయినా ప్రతి పనిలోను మెలకువలు నేర్చుకొనే శక్తి లోకవిద్యలో ఉంది. తరతరాల నుంచి వచ్చే జ్ఞానం మాత్రమే లోకవిద్య కాదు. ఆ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు కొత్త మెలకువలు నేర్చుకుంటూ మరింత సులభంగా చేయగలిగే నేర్పు ఈ లోకవిద్యాధరుల సొంతం. చదువుకున్న మేధావులు ఏదో ఒక రంగంలో మాత్రమే పనిచేయగలరు. లోకవిద్యాధర సమాజం అలాకాదు. ఒక కోణంలో కాకుండా, అన్ని కోణాలలో ఆలోచించి పారంపర్య విద్యకు నూతన ఆవిష్కారాలను జతచేసుకుంటూ దాన్నికూడా లోకవిద్యలో మిళితం చేసుకుంటూ అవసరాల మేరకు ముందుకు వెళ్ళేదే లోకవిద్య. ఇటువంటి సంపన్నమైన ఈ వర్గాలను వదిలేసి కొంతమంది మేధావులు నిర్ణయాలు తీసుకొనే ప్రస్తుత వ్యవస్థకు వ్యతిరేకంగా నూతన పరిష్కారాలు స్థానికంగా ప్రతిచోటా రావాలి.

**దీనికోసం మనముందున్న మార్గాలు అనేకం :**

1. ప్రస్తుత సమాజంలో న్యాయంకోసం పోరాడే రైతుల మరియు ఆదివాసీల సంఘాలు తమంతతాము ఈ సమస్యల పరిష్కారానికి తమకున్న జ్ఞానంతో కూర్చొని చర్చించి ఏకోన్ముఖంగా పరిష్కారాలు చూపించగలగాలి. తమ పరిష్కారాలు మాత్రమే శాశ్వత పరిష్కారాలు అనే జ్ఞానం తమకు మాత్రమే తెలుసునని ఈ రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు తెలియజేయాలి.

2. అలాగే మహిళల, వివిధ వృత్తి సంఘాల, చిన్న వ్యాపారస్తుల సంఘాలవారు ప్రస్తుత అభివృద్ధి నమూనాలో కొద్దిమంది మాత్రమే సంపద పోగుచేసుకుంటున్నారని, తమ జ్ఞానంతో వృత్తి విద్యల ద్వారా చేసే పనులకు సరైన ఖరీదు చెల్లించటంలోనే సమాజంలో హెచ్చు తగ్గులు నశిస్తాయని లోకవిద్యకు మాత్రమే ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలు చూపించగలిగే శక్తి ఉన్నదని ప్రకటించాలి.

3. రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, మరియు అభ్యర్థులు లోకవిద్యాధర సమాజం తీసుకొనే స్థానిక నిర్ణయాలను మాత్రమే అమలుజరుపుతామని వారి వారి మేనిఫెస్టోలో ప్రకటించాలి.

నవంబర్ 2011లో జరిగిన వారణాసి సమ్మేళనంలో "లోకవిద్యజనాందోళన" లోకవిద్య ద్వారా వచ్చిన జ్ఞానం మాత్రమే మన జాతీయ, అంతర్జాతీయ సమస్యలన్నింటికి పరిష్కారం అని ప్రకటించడం జరిగింది. లోకవిద్యాధరుల జ్ఞానం ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని గత 4 సంవత్సరాలుగా సేవాగ్రాం, దర్భాంగా, చీరాల, సింగ్రోలి, ఇండోర్, ముంబాయి, పూనె మొదలైన ప్రాంతాల్లో స్థానిక లోకవిద్యాధర సమాజ సభ్యులతో కలిసి ప్రకటిస్తూ వస్తున్నాం. జనవరి 2014న ముల్తాయ్ (మధ్యప్రదేశ్)లో కిసాన్ సంఘర్ష సమితి, మధ్యప్రదేశ్ మరియు లోకవిద్యాజనాందోళన సభ్యులందరూ కలిసి ఈ ప్రచారాన్ని ముందుకు తీసుకుపోవడానికి లోకవిద్యాధర సమాజం పునర్ వైభవానికి పంచసూత్ర ప్రకటన చేయాలని నిర్ణయించడం జరిగింది.

1. తమ లోకవిద్య ద్వారా వచ్చిన జ్ఞానాన్ని అనుసరించి బ్రతికే హక్కు ప్రతి పౌరుడికి ఉండాలి. అందుకోసం బలవంతపు

# సంపూర్ణ స్వరాజ్యానికి ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలి

మానవ నాగరికతలో ఆహారం తర్వాత అత్యంత ప్రధానమైనది వస్త్రం. అందుకే వ్యవసాయం తర్వాత అత్యంత పెద్ద పరిశ్రమగా చేనేత రంగం ప్రాముఖ్యత సంతరించుకున్నది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చేనేత బట్టలు ధరించటం ద్వారా తెల్లవాడిని దేశం నుండి పారద్రోలటానికి అది ఒక ఆయుధంగా ఉపయోగ పడింది. స్వాతంత్ర్యానంతరం మనదేశ దొరలు నూలుమిల్లులు పెట్టి కృత్రిమ దుస్తులు తయారు చేసి చేనేత రంగాన్ని భ్రష్టు పట్టించారు. దేశంలోని 120 కోట్ల మంది ప్రజలకు మనిషికి ఒక్కింటికి సంవత్సరానికి 90 మీటర్ల చొప్పున 60 వేల మిలియన్ల చ.మీ. వస్త్ర ఉత్పత్తి అవశ్యకత ఉంది. దీనికి సరిపడే ప్రత్తి ఉత్పత్తి దారులు, గింజ తీసేవారు, పత్తిని దారంగా మలిచేవారు, నేతకారులు, వస్త్రాన్ని రవాణా చేసేవారు, మార్కెట్ చేసేవారు వీరందరి ద్వారా కోట్ల మందికి ఉపాధి దొరుకుతుంది. భారతదేశంలో ప్రస్తుత అభివృద్ధి నమూనా వల్ల పత్తి రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరగటం గత పది పదిహేను సంవత్సరాలుగా చూస్తూనే ఉన్నాము. దీనిని వ్యతిరేకిస్తూ మన రాష్ట్రంలో వివిధ సంఘాలు, మిత్రులు, ట్రస్టుల పేరుతో ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు.

ఈ సంక్షోభ నివారణకు చేనేత సంఘాలు, మేధావులు గత 10 సంవత్సరాలుగా విశ్లేషిస్తూ ప్రత్యామ్నాయాలు సూచిస్తున్నా ప్రభుత్వం ఎంతమాత్రము శ్రద్ధ పెట్టడంలేదు. రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు విధానాల అమలువల్ల చేనేత రంగం తీవ్రంగా నష్టపోయింది. తెలుగుదేశం పాలనలో ఎన్.టి. రామారావు అధికారంలో ఉన్నప్పుడు ఆప్కోను విస్తరించి సంక్షేమ పథకాలు అమలుచేసి ఆప్కోను లాభాల బాట పట్టించిన కాలంలో తప్ప, చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత సంక్షేమం తగ్గించడం, సంస్కరణల వేగంతో రాష్ట్రంలో 5 లక్షల చేనేత వృత్తి దారులు 2 లక్షలకు తగ్గిపోయారు. సహకారరంగం కుప్పకూలింది.

పారిశ్రామికాభివృద్ధి పేరుతో కార్పొరేట్, ఎక్సైజ్, దిగుమతి సుంకంపై రాయితీల పేరుతో పెట్టుబడిదారులు 2011-12 నాటికి 5 లక్షల కోట్లు లబ్ధిపొందారు. ఇదే కాలంలో మిల్లు, మరమగ్గాల యజమానులు బాంకుల ద్వారా 2001-11 మధ్యకాలంలో 67000 కోట్ల రాయితీ పొందారు. చేనేత రంగంలో ప్రకటించిన 6200 కోట్ల ప్యాకేజిని 4200 కోట్లకు కుదించారు. ఈ ప్యాకేజి అమలులో చేనేత శాఖకు పూర్తిగా బాధ్యతలు ఇవ్వకుండా నాబార్డుకు అనుసంధానించడంతో మిల్లు, పవర్ లూం లాబీ కుట్రతో నాబార్డు సహకరించకపోవడంతో కేవలం 290 కోట్ల రూపాయలు కొద్దిమందికి మాత్రమే ఈ రాయితీలు లభించాయి.

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడల్లా తీరప్రాంతాలలోని చేనేత మగ్గాల గుంటలలోకి నీరు వచ్చి పనిచేయలేని పరిస్థితులు వచ్చినప్పుడు నూలు, మగ్గాల మరమ్మత్తులకు 5 వేల రూపాయల చొప్పున 4800 మందికి ఇవ్వాలని కలెక్టర్ జి.వో. జారీ చేసినా చేనేత కార్మికులకు ఇవ్వలేదు. గుంటూరు జిల్లా భట్టిప్రోలులో చేనేతకార్మికులు 16 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసినా నేటి వరకు ఎలాంటి నష్టపరిహారం అందించలేదంటే పాలకులకు కనీస మానవత్వం లేనిస్థితిని తెలియజేస్తోంది. ఉదా : గుంటూరు జిల్లాలో 2009 లో 15000 మంది చేనేత కార్మికులుంటే 2010లో 10,000 లకు 2013లో 5 వేలమందికి తగ్గిపోయారంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

ఉపాధి కల్పన పేరుతో లక్షల కోట్ల రాయితీలు పొందిన బడా కంపెనీలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వలన వేలమంది కాకుండా కేవలం వందల సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలు కల్పిస్తున్నారు. దీనికి ప్రతిగా చేనేత రంగంలో ఈనాడు 100 రకం నేసే చీరలు, డ్రస్ మెటీరియల్స్. సిల్క్ చీరలకు బాగా డిమాండ్ ఉంది. నాణ్యమైన నూలును సరసమైన ధరలకు అందించి సహకార సంస్థలకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే మరింత ఎక్కువమందికి చేనేత రంగంలో ఉపాధి కల్పించవచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సంక్షోభ తీవ్రతను రాజకీయ పార్టీల దృష్టికి తెచ్చి రాబోయే ఎన్నికలలో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మానిఫెస్టోలో చేనేత సమస్యలు ప్రస్తావించాలని రాష్ట్ర చేనేత జనసమాఖ్య చీరాల నుండి హైదరాబాద్ వరకు 30-1-2014 నుండి 13-2-2014 దాకా 24 మంది కార్యకర్తలు (నలుగురు మహిళలు) 492 కి.మీ. పాదయాత్ర చేసారు. చీరాల నుండి చిలకలూరిపేట, నర్సరావుపేట, పిడుగురాళ్ళ మాచర్ల, మిర్యాలగూడ మీదుగా 11వ తేదికి హైదరాబాద్ చేరుకొని గవర్నర్‌కి మెమోరాండమ్ సమర్పించారు. చేనేత యాత్ర ముగింపు సందర్భంగా 13వ తేదిన ఇందిరాపార్క్ వద్ద ఉదయం 10 గంటలకు ముగింపు సభ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కేంద్రాల నుండి చేనేత వృత్తిదారులు, లోకజనాందోళన సభ్యులు, జాతీయ ప్రజాపోరాటాల ఐక్యవేదిక, దస్తకార్ ఆంధ్ర, వికేంద్రీకృత నూలు ఉత్పత్తి సంఘం సభ్యులతో సహా సుమారు 200 మంది పాల్గొన్నారు. రాజకీయ పార్టీలను చేనేత జన సమాఖ్య కోరుతున్న డిమాండ్లు ఇలా ఉన్నాయి.

1. చేనేత ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టం - 1985 ప్రకారం 11 రకాల రిజర్వేషన్లను అమలు చేయాలి. ఉల్లంఘించిన మిల్లు, మరమగ్గాల యాజమానులపై కేసులు నమోదు చేసే అధికారం గ్రామ పంచాయితీ, జౌళిశాఖ అధికారులకు ఇవ్వాలి.
2. ఉత్పత్తి కొనుగోలు కేంద్రాలను చేనేత ప్రధాన కేంద్రాలలో ఏర్పాటు చేసి 300 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలి.
3. చేనేత కార్మికులకు నాణ్యమైన హాంక్ నూలు, సిల్కు జరీ నూలును సరసమైన ధరలకు అందజేయాలి.
4. చేనేత వృత్తిదారులు, సేవా కులాలవారి సంక్షేమం కోసం 500 కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలి.

చేనేత కార్మికుల పాదయాత్ర సందర్భంగా వివిధ పార్టీల నాయకులు చేనేత రంగ అభివృద్ధికి పై కోర్కెలను పరిష్కరించేందుకు తమ పార్టీ నాయకత్వ దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. వృత్తి విద్యలో జీవితాలను గడిపే లోకవిద్యాధరులు ముందుగా తమ దైనందిన జీవితంలో అన్ని వస్తువులు ఈ రంగంలోనే కొని వాడాలని లోకవిద్యాజనాందోళన విజ్ఞప్తి చేసింది. విశాల జనబాహుళ్యం నూలు వస్త్రాలను ధరించి ప్రత్తి రైతుల చేనేతవృత్తికారుల ఆత్మహత్యలను ఆపాలని కూడా పిలుపిచ్చింది.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2 లక్షల రుణం, 3 శాతం వడ్డీతో పెట్టుబడిని నాణ్యమైన నూలును సరసమైన ధరలకు అందించడం మార్కెటింగ్ సహకారం ద్వారా తగిన ప్రతిఫలం లభించేటట్లు చిత్తశుద్ధితో అమలు జరిపితే చేనేతరంగంలో ఇంకా అనేకమందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. బడా కంపెనీలకు, మిల్లులకు రాయితీలు తగ్గించి లక్ష కోట్లను కేంద్ర ప్రభుత్వం చేనేత రంగంకు కేటాయించాలని, రాజకీయ పార్టీలు ఇప్పుడైనా స్పందించకపోతే కుటీర పరిశ్రమగా చేనేతరంగం నిలదొక్కుకోవటం కష్టం. ఉత్పాదకత కాకుండా ఉపాధి అవకాశాల రీత్యా ఈ రంగానికి అన్ని విధాల సహకరించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో ముందుకు వస్తే చేనేత రంగం సమస్యలను పరిష్కరించడం అసాధ్యం కాదు. విదేశీ వస్త్రాలను కాకుండా చేనేత వస్త్రాలు ధరించడమే సంపూర్ణ స్వరాజ్యానికి గ్యారంటీ అవుతుంది.

- కె.జె. రామారావు

# వారణాసి విద్యాశ్రమంలో ఫిబ్రవరి 10-11, 2014 లో జరిగిన పంచాయితీ తీర్మానాలు

లోకవిద్య జనాందోళన నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘాలు, వృత్తిదారులు 100 మంది ఇండోర్, ముల్తాయ్, సింగ్రౌలి, సీది, లక్నో, దర్భంగా మరియు వారణాసిజిల్లాల నుండి వారణాసి విద్యాశ్రమంలో సమావేశం అయ్యారు.

9వ తేది సన్నాహక సమావేశంలో ఇండోర్ నుండి వచ్చిన షేర్‌సింగ్, మేస్త్రీ మాట్లాడుతూ లోకవిద్య ప్రభుత్వం మాత్రమే పేదల ప్రయోజనాలు పరిరక్షించగలుగుతుందని అయితే ఇప్పుడు అమలులో ఉన్న ఎన్నికల ప్రక్రియ ద్వారా లోకవిద్య ప్రభుత్వం ఏర్పాటు సాధ్యంకాదని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ఈ అంశంపై 10, 11 తేదీలలో చర్చించాలని భావించారు.

ఫిబ్రవరి 10వ తేదీ మొదటి సమావేశంలో లోకవిద్య జనాందోళన కార్యకర్తలు ఈ విషయమై వివిధ ప్రాంతాల్లో చర్చను ప్రారంభించాలని ఉదా : సంజీవ్‌దాజి, వారి అనుచరులు ఇండోర్‌లో, సంగ్రౌలిలో లక్ష్మీచంద్‌దూబే, రవిశేఖర్, దర్భంగా నుండి చంద్రవీర్, నారాయణ్, విజయకుమార్‌లు, వారణాసి నుండి ప్రేమలతా సింగ్, ఎహసాన్ అలీ, దిలీప్‌కుమార్‌లు, మాల్ నుండి సురేష్‌యాదవ్, సీది నుండి ఉమేష్ తివారీ వారి ప్రాంతాల్లో లోకవిద్య ఆధారంగా ప్రభుత్వం ఏర్పాటుపై పంచాయితీలు నిర్వహించి ప్రజల నుండి అభిప్రాయాలు కోరాలని నిర్ణయించడం జరిగింది. అవదేశ్ కుమార్, మంజుసింగ్, ఎక్లాలు సింగ్రౌలి, లక్నో నుండి సీనియర్ పాత్రికేయులు అంబరీష్‌కుమార్ కూడా మాట్లాడారు. డా॥ చిత్రా సహస్రబుద్దే మొదటి సమావేశాన్ని ముగిస్తూ అన్ని ప్రాంతాల్లో వివిధ వర్గాల ప్రజలతో బహిరంగ పంచాయితీలు నిర్వహించి లోకవిద్య ఏజెండాను రూపొందించాలని, దీనికనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

11వ తేదీ 2వ సమావేశంలో రైతు సంఘాలు, వృత్తిదారులు ప్రధానంగా పాల్గొన్నారు. భారతీయ కిసాన్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు దీవాన్ చంద్ చౌదరి, నురేష్‌యాదవ్‌లు ఉత్తరప్రదేశ్ చేనేత సంఘం నుండి అస్రార్‌బాయి మాట్లాడారు. భారతీయ కిసాన్ యూనియన్ నాయకులు మీర్జాపూర్, వారణాసి, షుజియాపూర్ మరియు చందౌలి నుండి కూడా మాట్లాడారు. అనేకమంది లోకవిద్య దృక్పథం వారి అనేక కొత్త మార్గాలను, ఆలోచనలను కలిగించిందని పేర్కొన్నారు.

3వ సమావేశంలో ప్రస్తుత సంక్షోభ దశలో రాబోయే ఎన్నికలలో ఆమ్‌ఆద్మీపార్టీ నేపథ్యంలో లోకవిద్యా ఏజెండాను జాతీయ ఏజెండాగా పంచాయితీల ద్వారా ప్రచారం చేయాలని ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణం సమస్యలపై కేంద్రీకరించాలని డా॥ సునీలం, సునీల్‌సహస్ర బుద్దే పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ, సాంఘిక ఉద్యమాల మధ్య వుండాల్సిన సంబంధాల పై చర్చించారు. లోకవిద్యాధర సమాజం యొక్క సమస్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి పెద్దగా ఆశించలేమని, లోకవిద్య ఏజెండాను ముందుకు తీసుకువెళ్ళే ప్రక్రియ ముల్తాయ్‌లో ప్రారంభించామని ఈ ప్రక్రియను అన్ని ప్రాంతాలలో కొనసాగించాలని కోరారు. ముల్తాయ్ సదస్సు తీర్మానించిన 5 కోర్కెలను ముందుకు తీసుకెళ్ళాలని ప్రతిపాదించారు.

1. ప్రజలను ఆవాసాల నుండి తొలగించబడటం నిలిపివేయాలి.
2. లోక్యవిద్యాధరులకు యూనివర్సిటీలతో సమానంగా వేతనాలు ఇవ్వాలి.
3. జాతీయ వనరులను సమాన పంపకం
4. సహజ వనరులపై స్థానిక ఆధిపత్యం
5. మార్కెట్, పాలన, మీడియా స్కూలు ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయాలి.

- లోకవిద్యజనాందోళన, వారణాసి

(మొదటి పేజి తరువాత)

వలసలు పంపే ప్రాజెక్టులు ఏవీ చేపట్టరాదు. రైతులకు, వృత్తికారులకు, గిరిజనులకు, వారి ఉత్పత్తులకు, సేవలకు సరైన ధర చెల్లించాలి.

2. జ్ఞాన ప్రపంచంలో కొందరి జ్ఞానం గొప్పదని, మరికొందరి జ్ఞానం వెనకబడిందని చెప్పటం అన్యాయం. ఎవరైతే లోకవిద్య ద్వారా వచ్చిన జ్ఞానంతో ఉత్పత్తులు చేస్తారో వారికి విశ్వవిద్యాలయ విద్యావంతులతో సమానమైన వేతనాన్ని ఇవ్వాలి. మొదటి అడుగుగా ముందుగా ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలు ఇవ్వాలి.

3. జాతీయ సంపద మీద ప్రతిఒక్కరికీ సమానమైన హక్కు ఉంది. విద్యుత్, నీరు, వాయు తరంగాలు, సహజవాయువు ఆర్థిక, ఆరోగ్య, విద్యారంగాల్లో అందరికి సమానమైన హక్కు ఉంటుంది.

4. స్థానిక సంస్థలను స్థానికంలతే నియంత్రించే అధికారం ఉండాలి. స్థానిక పరిపాలన, స్థానిక వ్యాపార లావాదేవీలు, ప్రకృతి వనరులైన నీరు, అడవి, సహజవాయువు భూమితో సహా అన్ని స్థానికుల పరిపాలనలోనే ఉండాలి.

5. ప్రతి గ్రామంలోను స్థానిక భాషలో మీడియా పాఠశాల ఏర్పాటు జరగాలి. దీని ద్వారా నూతన సమాజ నిర్మాణంలో గ్రామీణ యువత పాలుపంచుకొని తమ భావాలను వ్యక్తీకరించి, లోకవిద్యా జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ లోకవిద్యాధర సమాజం మాత్రమే హెచ్చుతగ్గులు లేని, ప్రేమాభిమానాలు కల్గిన, ఈర్ష ద్వేష రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తారు.

2014 సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత లోకవిద్య జనాందోళన సదస్సు మనం ఏ మేరకు సాఫల్యం చెందామనే విశ్లేషణ జరుపుతుంది.

- లోకవిద్యజనాందోళన, హైదరాబాద్

# విజయవంతమైన 24 మంది చేనేత పాదయాత్ర ముగింపు సభ

11 రకాల చేనేత రిజర్వేషన్ల అమలుకు, చేనేత కొనుగోలు కేంద్రాలు ఏర్పరచి 300 కోట్లు బడ్జెట్ కేటాయించాలని, చేనేత వృత్తిదారులు, సేవా కులాల సంక్షేమంకు 500 కోట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేయమని రాష్ట్ర చేనేత సమాఖ్య ఆధ్వర్యంలో 24 మంది కార్యకర్తలు చేనేత గ్రామాల గుండా సాగిన పాదయాత్ర ప్రకాశం, గుంటూరు, నల్లగొండ జిల్లాల గుండా సాగి ఇందిరాపార్క్ వద్దకు 13-2-2014న ముగిసింది. ముగింపు సందర్భంగా 200 మంది ప్రకాశం, గుంటూరు, చిత్తూరు, నల్లగొండ జిల్లాల నుండి తరలివచ్చారు. ఈ సభలో దస్తకార్ఆంధ్ర నుండి ఉజురమ్మ, శ్యామసుందరి, చీరాలనుండి మహిళా నాయకురాలు సజ్జా హేమలత, లోకవిద్య సంపాదకులు నారాయణరావు, కె.జె. రామారావులు, బీరక సురేంద్ర, ప్రొ॥ క్రిష్టంరాజులు, చేనేత బోర్డు సభ్యులు తడ్క యాదగిరి, లక్షీనారాయణ, వూదుకురి వెంకటేశ్వర్లు, ఆకురాతి మురళీకృష్ణ, మాచర్ల మోహన్ రావు తదితరులు ప్రసంగించారు.

ఈనాడు పారిశ్రామిక అభివృద్ధి పేరుతో పారిశ్రామికవేత్తలకు వేలకోట్ల రూ॥ల రాయితీలు కల్పించి కొద్దిమందికి ఉపాధి కల్పిస్తున్నారని, చేనేత రంగంలో 30,000 రూ॥లు పెట్టుబడితో సం॥రానికి 3 లక్షల రూ॥లు ఉత్పత్తి జరుగుతుందని, అనేకమందికి ఉపాధి కల్పించవచ్చని తక్కువ పెట్టుబడితో ఇప్పుడున్న వారేగాక ఇంకా 2 లక్షలమందికి ఉపాధి కల్పించవచ్చని, చేనేత రంగంను పరిశ్రమగా గుర్తించాలని, ఎటువంటి రాయితీలు లేకుండా అనేక మందికి ఉపాధి కల్పించగలిగే చేనేత రంగంను కాపాడుకోవాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు నష్టకరంగా వున్నాయని ఉజురమ్మ వాపోయారు.

1991 ఆర్థిక సంస్కరణల అమలు నుండి చేనేత రంగానికి ఆదరణ కరువైందని తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రబాబు నాయుడు ఇంకా ఎన్నాళ్ళు ఈ మగ్గాలలో పని చేస్తారు. వృత్తి మారండి అని చెప్పారు. రాజశేఖర్ రెడ్డి కూడా అధికారంలోకి వచ్చేంతవరకు చేనేతకు అనుకూలంగా మాట్లాడి అనంతరం ప్రైవేటు సంభాషణల్లో మగ్గాలు వదిలేయమని చెప్పారు. ఈ దేశంలో మిల్లు యజమానులు ఆధునీకరణ ద్వారా మిల్లులు మూసివేసి జెట్లూంల ద్వారా మరమగ్గాల యూనిట్లను విస్తరించారు. మిల్లు, మరమగ్గాల యజమానుల లాభాల కోసం రాజకీయ పార్టీలు రాష్ట్రంలో 5 లక్షల చేనేత కుటుంబాల వారికి నష్టకరంగా ఉండే విధానాలను అమలు చేసారని చేనేత వృత్తిదారులు పార్టీలకతీతంగా ఐక్యమై వృత్తి రక్షణకు ముందుకు రావాల్సిన ఆవశ్యకత వుందని తడ్క యాదగిరి పేర్కొన్నారు.

రాష్ట్ర చేనేత సమాఖ్య నాయకులు, కార్యకర్తలు మాచర్ల మోహనరావు నాయకత్వంలో 24 మంది ఎన్నో కష్టాలు నెదుర్కొని పాదయాత్ర ద్వారా చేనేత గ్రామాలను మేల్కొలిపారని, వీరి కష్టం వృధా కాదని సజ్జా హేమలత పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు దేశంలో బాగా డిమాండు వుందని కేంద్ర, రాష్ట్ర పాలకుల నిర్లక్ష్య వైఖరి వలన ఈ పరిస్థితి ఏర్పడిందని ఈనాడు అసెంబ్లీలో, పార్లమెంటులో చేనేత గుర్చి మాట్లాడే వారులేరని అందరూ కలిసి మాచర్ల మోహన్‌రావు లాంటి నిజాయితీ పరులైన నాయకుల్ని ఎన్నుకోవాలని పటిష్ట నాయకత్వం అభివృద్ధి కావాలని శ్యామసుందరి పేర్కొన్నారు.

లోకవిద్య సంపాదకులు టి. నారాయణరావు మాట్లాడుతూ పాదయాత్ర ప్రారంభంలో పాల్గొన్నాను. చివరిరోజు మీతో 12 కి.మీ. నడిచాను. ఈ మధ్యకాలంలో పాదయాత్రలు కొంతమంది నాయకులని తయారుచేయడానికి, లేదా కొన్ని పార్టీలనధికారం సంపాదించడానికి జరుగుతున్నాయని, దేశంలో మొదటిసారిగా చేనేతరంగం బాగుపడాలని రాష్ట్రచేనేత జన సమాఖ్య తలపెట్టిన 24 మంది పాదయాత్ర చరిత్ర సృష్టించింది. బహుశ దేశంలో ఇదే మొదటిదేమో. 19 ఏళ్ళ యువకుల నుండి 69 ఏళ్ళ వృద్ధుల వరకు, మహిళలు 4గురు పాల్గొనడం నాకు చాలా స్పూర్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ మధ్య మేదర్లు, కుమ్మర్లు కలిసి సభ జరిపి ప్లాస్టిక్ వస్తువుల ప్రవేశంతో ఉపాధి కోల్పోయామని ఆందోళన చెందారని, గ్రామీణ ప్రాంతంలో రైతులు, చేనేత కార్మికులు, మేదర్లు, కుమ్మరులు అన్ని వృత్తులు ప్రభుత్వ విధానాల మూలంగా దివాళా తీసి పట్టణాలకు వలస వస్తున్నారు. వీరందరిని కూలీలుగా మార్చే మహాత్మగాంధీ జాతీయ ఉపాధి పథకం ప్రవేశపెట్టారని ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కనపడడం లేదని చెప్పారు. ఎరువులు, పురుగుమందులు అధికవాడకం వలన భూసారం కోల్పోయి, అనేకమంది కాన్సర్ రోగులు పెరిగారని, అన్ని వర్గాల వారు ప్రస్తుత అభివృద్ధి నమూనా వల్ల ఉపాధి కోల్పోతున్నారని, ప్రత్యామ్నాయంగా ప్రజలందరూ ఒకరిపై ఒకరు ఆధారపడే గ్రామీణ సంతలలో స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయడం, విదేశీ వస్తువులు బహిష్కరించడం ద్వారానే ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. లోకవిద్యజనాందోళ నుండి చేనేత పరిశోధకులు కె.జె. రామారావు మాట్లాడుతూ చేనేత రంగంకు కావల్సిన ముడి సరుకు నూలును పత్తి నుండి దారం తీసి రైతులు, ఇతరులు తయారు చేసి చేనేత రంగంకు అందించాలని, ఉపాధి హామీ పథకం కింద నిపుణులైన కార్మికులతో సమానంగా ప్యాక్టరీ కార్మికులకు సమానంగా, ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని పోరాడాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం మార్పుచేయాలని, అన్ని వృత్తుల వారికి పని కల్పించడం, వారు తయారుచేసిన సరుకులను గ్రామీణ సంతలలో గ్రామ ప్రాంతాల ప్రజలు కొనుగోలు చెయ్యాలని దీనివలన ప్రతీ ఒక్కరికి ఉపాధి లభిస్తుందని తెలిపారు.

చేనేత రంగంలో ఆప్కో గుదిబండగా మారిందని మన పేరుతో రాజకీయ నాయకులు, అధికారులు బలుస్తున్నారని, చేనేత వ్యతిరేక విధానాలు అవలంబించే వారి ఎడల ప్రజల ఆగ్రహాన్ని ఉద్యమ రూపంగా రావాలని, ఆమ్ ఆద్మీ పార్టీలాగా అవినీతి పరులను, చేనేత వ్యతిరేకంగా చేసేవారిని తరిమికొట్టాలని, ముడిసరుకులు, సహకార వ్యవస్థ, మార్కెట్, నిధుల కేటాయింపులు చేనేత రంగంలో నిజాయితీ, చిత్తశుద్ధిగల వారి ఆధ్వర్యంలో జరగాలని, మిల్లు, పవర్‌లూం ఉత్పత్తులను బహిష్కరించాలని ప్రజా వ్యతిరేకులపై ప్రజల ఆగ్రహాన్ని వెలికి వచ్చేటట్లు చేయాలని పేర్కొన్నారు.

గుజరాత్‌లో కురియన్ నిర్మించిన ఆనంద్ తరహ సహకార ఉద్యమం ద్వారానే ప్రజల అధికారం సాధ్యమని ఆవైపుగా ప్రజలను సిద్ధం చేయాలని కోరారు.

చివరగా మాచర్ల మెహనరావు మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా చేనేత వృత్తిదారుల్లో ఆలోచింప చేయాలని అనుకున్నాం. పొరుగు రాష్ట్రం అయిన కర్ణాటకలో దేశీసంస్థ పాదయాత్ర, సత్యాగ్రహం చేసిన ఫలితంగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం 500 కోట్ల బడ్జెట్ ప్రకటించింది. మన రాష్ట్రంలో ప్రధానంగా తెలంగాణా జిల్లాలో అనుకున్న దానికన్నా 130 కి.మీ. అదనంగా పర్యటించాం. చేనేత గ్రామాలు అన్నీ తిరగడంతో ప్రయాణం పెరిగినా ప్రజలలో స్పందన బాగుంది. రాష్ట్రంలో ఒక పక్క బంద్ వాతావరణం, పారామిలటరీ బలగాల మొహరింపుతో ప్రజలు రాకపోయినా నవ తెలంగాణాలో నయిన చేనేత వృత్తిదారులు ఉద్యమంలోకి వస్తారనే విశ్వాసం కలిగిందని పేర్కొన్నారు. అనేక ఇబ్బందులు ఎదురైనా వృద్ధులు, యువకులు, మహిళలు చేనేత వృత్తి పరిరక్షణకు పాదయాత్ర జరపడం ప్రజలు ఇచ్చిన సహకారం వల్లనే సాధ్యమైందని ఈ కార్యక్రమానికి అన్ని రకాలుగా మద్దతు అందించిన నాయకులు, మేధావులకు కృతజ్ఞతలు తెలిపి ముగించారు.

**- లోకవిద్యా ప్రతినిధి**

**వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.**

# మరణ శయ్యపై ప్రజారోగ్యం

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలంగా వేళ్ళూనుకున్న మనదేశంలో కుటుంబ సభ్యుడొకరు అనారోగ్యంతో 'ప్రైవేట్ సూపర్ స్పెషాలిటి' ఆసుపత్రిలో చనిపోతే, తడిసిమోపెడైన 'బిల్లు' కట్టలేక రక్తసంబందీకులు, దగ్గరి బంధువులు, మిత్రులు, శవాన్ని అక్కడే వదలివెళ్ళిపోయే పరిస్థితికలగడం అత్యంత విషాదకరం. తమకు సరైన వైద్యం అందించగలవనే భ్రమలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు వెళ్ళిన ప్రజలు, వైద్యపు ఖర్చులకోసం తమ జీవనాధారాలైన భూమి, చివరకు నివాసస్థలాలను సైతం అమ్మి 'బిల్లులు' కట్టి జీవచ్ఛవాల్లా బ్రతుకీడవడం మనం ఈరోజు గమనిస్తున్నాం. ఒకప్పుడు కనీసం జిల్లాస్థాయిలో ప్రభుత్వ హాస్పిటల్‌లో దొరికే నాణ్యమైన వైద్య సేవలు ఈరోజు ప్రజలకు అందుబాటులో లేకపోవడానికి ప్రజారోగ్యంపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణం.

స్వేచ్ఛావాణిజ్యం, గ్లోబలైజేషన్ పేరిట ప్రభుత్వం తన ప్రాథమిక కర్తవ్యమైన 'ప్రజారోగ్యం' అనే అత్యంత ప్రాముఖ్యం కలిగిన అంశాన్ని ప్రైవేటు పెట్టుబడి దారుల ద్వారా నడిపే 'సూపర్ స్పెషాలిటి' హాస్పిటల్స్‌కు అప్పగించడం జరిగింది. మానవతా విలువలు ప్రామాణికంగా పాటించే వైద్యరంగం పెట్టుబడి ప్రవేశంతో వ్యాపార దృక్పథాన్ని సహజంగానే సంతరించుకుంది. అయితే అది నిలదొక్కుకోవడానికి ముందున్న ప్రభుత్వ వైద్యవిధానాలను 'భ్రష్టు' పట్టించాలి. మంచి కుక్కను చంపడానికి ముందు దానికి 'పిచ్చి' అనే ముద్ర వేయడం అవశ్యకం. ఈ ప్రక్రియలో భాగంగానే ప్రభుత్వాలు తమ ఆధ్వర్యంలో నడిచే ఆసుపత్రులను క్రమబద్ధంగా నిర్వీర్యం చేయడం కనిపిస్తుంది. 2000 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక వైద్యరంగ ప్రముఖులతో టాస్క్ ఫోర్స్‌కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. డిసెంబరు 2000 నాటికి సమర్పించిన కమిటి తమ నివేదికలో ఈ చేదు నిజాలను వెల్లడించింది.

1. ప్రాథమికస్థాయి నుంచి, పట్టణాల్లోని ఆస్పత్రుల వరకూ అన్నింటా అరకొర సౌకర్యాలే
2. సగానికి పైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్వంత భవనాలు లేవు.
3. వైద్యులకు సరైన ప్రోత్సాహకాలుకాని, కనీస జీతభత్యాలు కాని లేవు.
4. మందుల కొరత తీవ్రంగా ఉంది.
5. మనరాష్ట్రంలో టీచింగ్ ఆసుపత్రులలో సైతం అధునాతన పరికరాలు లేవు.
6. ప్రాథమిక విద్యా కేంద్రాలలో పనిచేసే వైద్యులకు నివసించడానికి గృహవసతిలేదు. మంచినీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలు లేవు. సిబ్బంది నియామకాలు నిలిచిపోయాయి.

అయితే ప్రభుత్వాలు ఈ పరిస్థితిని మెరుగుపరచి ప్రజలందరికి ఆరోగ్య సౌకర్యాలు అందించే ప్రయత్నాలేవి చేయకపోగా, ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు అనుకూలంగా 'బడ్జెట్'లో నిధులు కేటాయించడం జరుగుతోంది. భారతదేశంలో 68 శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తుంటే అందులో సగం దారిద్ర్య రేఖకు దిగువలో ఉండటం, వారు గ్రామీణ చేతివృత్తుల సముదాయం, ఎస్సీ/ఎస్టీలుగా ఉండటం ఒక వాస్తవం. వారికి ఈ రోజు అత్యవసర వైద్యం అందాలంటే పట్టణాలకు వెళ్ళలేని స్థితి, ఒకవేళ వెళ్ళి ప్రైవేటు దవాఖానాలో చేరినా వాళ్ళ ఆస్తులు హరించుకుపోయి కట్టుబట్టలతో నిలవాల్సిన దుస్థితి.

నిజానికి ప్రభుత్వాలు ప్రజారోగ్యం కాపాడటంలో చూపే నిర్లక్ష్యం, ముందు జాగ్రత్త లేమి కారణంగా వాళ్ళు ఆసుపత్రులకు వెళ్ళాల్సిన పరిస్థితులు కల్పించబడ్డాయనడానికి ఈ వాస్తవాలే తార్కాణం.

1) పోషకాహారం లేమివల్ల భారతదేశంలో 42శాతం మూడేళ్ళ లోపుపిల్లలు బాధపడుతున్నారు. (2005 రిపోర్టు)

2) మురికివాడల్లో నివసించే ప్రజలలో 26 శాతం మందికి మాత్రమే మంచినీరు తాగడానికి దొరుకుతుంది.

3) 12.2 కోట్లమంది కుటుంబాలకు టాయిలెట్ సౌకర్యం లేదు. 63.8 కోట్లు, సగానికి పైగా జనాభా బహిరంగ ప్రదేశాల్లోనే మలమూత్రం విసర్జన జరుపుతారు. (2008 నివేదిక) స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం అనే ముఖ్య అంశాలు రోగనిరోధానికి అత్యావశ్యాలు అని గుర్తించి వాటికి తగిన నిధులు కల్పించాలి. ప్రభుత్వం ఈ ప్రాథమిక సత్యాన్ని విస్మరించడం జరిగింది.

అంటురోగాలు, పోషకాహార లోపం వల్ల వచ్చే వ్యాధులను నివారించడానికి అరకొర (చాలీచాలని) కేటాయింపులు చాలవు. భారతప్రభుత్వపు 12వ పంచవర్ష ప్రణాళికలో స్థూల జాతీయాదయంలో 2.1 శాతం మాత్రమే ప్రజారోగ్యానికి కేటాయించడం జరిగింది. ఖర్చులో 80% ప్రైవేటు ఆసుపత్రుల కిచ్చే ప్రభుత్వ ఉద్యోగుల బిల్లులు చెల్లింపులకే సరిపోతుంది. అంటే ప్రభుత్వ ఆసుపత్రులకి బడ్జెట్ కేటాయింపు అంతిమంగా 1% లోపే. ప్రపంచ ఆరోగ్య సూచిక ప్రకారం యిది 5 శాతం ఉండాలి. ఈ తక్కువ కేటాయింపు ద్వారా ప్రజలు తమ ఆదాయంలో గణనీయంగా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించాల్సిన పరిస్థితి. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సేవలలోను మందులలేమి కారణంగా మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. వైద్యసేవలు ప్రభుత్వరంగంలో విస్తరించడానికి బదులు ప్లానింగ్ కమిషన్ ప్రైవేటు రంగ వైద్యసేవలు విస్తరించడానికి తోడ్పాటు అందించడం జరిగింది. జాతీయ గ్రామీణ ఆరోగ్య సంస్థ సూచించిన ప్రతిలక్ష జనాభాకు 30-50 పడకల సామర్థ్యంగల కమ్యూనిటి హెల్త్ సెంటర్లను గురించిన ప్రస్తావనేలేదు. అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థలో 'పౌష్ఠికాహారం' ఆవశ్యకతను పూర్తిగా విస్మరించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రజారోగ్య కేటాయింపులో సింహభాగం

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.

RNI Regd. No. APBIL/2012/50668 Postal Regn. No. HSE/677/2013-2015



## ہندوستان کی عوام اور اسکی گربت ۱۵

کچھ دن پہلے ہند کی راجدھانی میں ایک نیے کانوں کا ازاد ہوا ؛ وہ یہ کہ بد عنوانی پے روک لگانے کے لیے اگر ودھان سبھا میں کوئی کدم اٹھانے ہوں تو پہلے مرکجی سرکار کی عزازات لینی ہوگی! مطلب یہ کہ گھوسکھوڑی کو روکنے کے لیے پہلے مرکج سے عزازات لینی ہوگی! ایک اور تریکے سے دیکھیں تو یہ کہنا مناسب ہوگا کہ گھوسکھوڑی کو بڈاوا دینے کے لئے اس عزازات کی ضرورت نہ ہوگی!

دیش کے سبسے بڑے دو سیاسی دلوں نے دہلی ودھان سبھا میں ام آدمی پارٹی کا بدعنوانی پے روک لگانے کی پرستاو کو ہنگاما کرکے روک دیا اور ام آدمی پارٹی کی سرکار گر گیی۔ یہ تو ہونا ہی تھا کیونکہ جس صنعتکار کا یہ سیاسی دل کھاتے ہیں انھ نکسن تو نہیں کر سکتے۔ جن لوکپال بل کی خلافت کا مطلب ہے بدعنوانی کی سفارش۔

اس واقیات سے جو صَداقَت سامنے آتی ہے وہ یہ کہ ارادے اگر پاک نہ ہوں تو جانے انجانے میں ایسا کام ہو ہی جاتا ہے جسسے اصلیت سامنے آتی ہے۔ ناپاک ارادے بدعنوانی سے کہیں جیادہ نکسان کرتے ہیں۔ ارادے اگر پاک ہوں تو بدعنوانی کا وجود ہی نہیں ہوتا۔ ہندوستان پے جس بھی سیاسی دل نے حکومت کی انکے ارادے ناپاک تھے۔ یہی وجہ ہے کی ہندوستان میں ہر طرف گربت ہی گربت دیکھتی ہے۔ انکے انہی ناپاک ارادوں کا نتیجہ ہے دہشتگردی اور فِرقَہپرستی جسکے شکار صرف ام انسان بنتے ہیں۔

انتخابات سر پے ہیں؛ ہمارے لئے یہ سوچنا ضروری ہے کی آخر کیونکر ہم ان سیاسی دلوں کو اپنا ووٹ دیں؟ ہر انتخابات سے پہلے ہر امیدوار ہزاروں وادے کرتا ہے اور پھر انہیں پورا نہیں کرتا۔ اس پے روک لگانے کی لیے کیوں نہ ہم انکے سامنے اپنی اپنی شرطیں رکھیں اور انسے یہ وادا لیں کی چناں جیتنے کے باد وہ ہماری شرطوں کو پورا کرینگے۔ یہ شرطیں کیسی ہوں اسپے غور کرنا ضروری ہے ۔ جیسا کی ہم سب کو علم ہے کی ہمارے ملک میں ۸۰ فیصد سے جیادہ آبادی کسانو، بنکروں، ادواسیوں، اور چھوٹے چھوٹے ویپاریوں کی ہے۔ ان سب پیشاوروں کا وضعد اپنے اپنے علم پے ہے۔ اس علم کو ہمنے لوکودیا کہا ہے۔ کیوں نہ ہم یہ مانگ رکھے کی لوکودیا کو برابری کا درجہ دوسری کسم کی علموں کے ساتھ دیتے ہوائے ہم کو بھی برابری کا محنتانہ دیا جایے؛ اور ہماری بنایی گیی وستوو کو بازار میں نیمیت ترکوں سے بچنے مافک ویسی ہی انتجامعات وضعد میں لایں جایے جیسے بڑے بڑے صنعتکاروں کےلیے کیے جاتے ہیں۔ ہمارے علم کو بےعلمی اور ہنر کو بے ہنری کا درجہ نہ دیا جائے، کیونکہ ودیا صرف سکولوں اور کالجوں میں نہیں ملتی اسکو حاصل کرنے کے کیی اور ترکے ہیں۔

کیونکہ علم صرف انگریزی اور انگریزیت میں نہیں یہ تو ہر ہندوستانی میں ہے ۔

(మూడవ పేజి తరువాత)

ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు చేరేట్లు రాష్ట్రీయ స్వస్థ్య భీమా యోజన పథకం రచించబడింది. ఈ పథకం రోగ నిర్ధారణలో గల అసమానతలను, దానికి సంబంధించిన వైద్య విధానాన్ని గుర్తించలేదు. తద్వారా విరిగినకాలుకు పిండికట్టువేయడానికి బదులు ఆపరేషన్ ద్వారా స్టీలురాడ్స్ వేయడం, అనవసరపు ఆపరేషన్లు టెస్ట్‌లు, పనికిమాలిన మందులు పేషంట్లకు ఇవ్వడం జరుగుతోంది. చెయ్యని వైద్యం చేసినట్లు లెక్కలు చూపి దోచుకున్న ప్రైవేటు ఆసుపత్రిలపై సరైన పర్యవేక్షణ కూడా లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశబడ్డ "ఆరోగ్యశ్రీ" పథకం యిందుకు మినహాయింపు ఏమీకాదు.

ప్రజలు ఒక 'హక్కుగా' పొందుతున్న ప్రభుత్వ ఆరోగ్య సర్వీసులను పథకం ప్రకారం నిర్వీర్యం చేసి, వారిని ప్రైవేటు ఆసుపత్రుల దయాదాక్షిణ్యానికి, దోపిడికి అప్పగించడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగపరమైన హక్కుల నుండి వారిని విడదీయడమే. యిప్పటికే ఈ దేశంలో సన్న, చిన్నకారు రైతులు, చేతివృత్తులవారు, నిరుపేద ప్రజలు, తమ కుటుంబ నిర్వహణకోసం, చేసిన అప్పులు తీర్చడం కోసం ధనిక రోగులకు అత్యంత ప్రాధాన్యంకల తమ శరీరావయవాలను 'అమ్ముకొని' నడుస్తున్న శవాల్లా తమ జీవితాన్ని వెళ్ళదీస్తున్నారు.

జంతువుల మీద ప్రయోగించాల్సిన నూతన ఔషధాలను మనుగడకోసం, ప్రాణాలు ఫణంగా పెట్టి, తమ శరీరాలను ప్రయోగశాలల క్రింద మార్చే స్థితికి ఈ దేశ నిరుద్యోగులు, పేద ప్రజలు నెట్టబడ్డారు. పేద ప్రజలను ఉద్దరిస్తామనే పాలక, ప్రతిపక్ష రాజకీయపార్టీలు 'నిప్పుకోళ్ళలా' వాస్తవాన్ని చూడడానికి నిరాకరిస్తున్నాయి. మతం పేర, కులంపేర, ఓట్లకొనుగోలు ద్వారా రాజకీయాధికారం స్వంతం చేసుకోగలమనే ధీమాను ప్రజలే వాళ్ళకు కల్పించారు.

ఆరోగ్యమనేది మనుగడకు సంబంధించిన అతి ముఖ్యమైన సమస్య. ఈ రోజు ప్రపంచీకరణకు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 'లాటిన్ అమెరికన్' దేశాలు సాగిస్తున్న ప్రజా ఉద్యమాలను స్ఫూర్తిగా తీసికొని బలమైన పౌర సమాజాలను ఏర్పాటు చేసికొని, కుల, మతాలను ప్రక్కకునెట్టి ఏకతాటిపై పోరాటం సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజారోగ్యం పద్దుకింద బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ప్రభుత్వ ఆసుపత్రులలో వసతుల కోసం, ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు, నాణ్యతగల మందులకోసం వెచ్చించడం ద్వారానే సామాన్య ప్రజానీకానికి ఆరోగ్య భరోసా ఏర్పడుతుంది. దానికి ముందు తాగునీరు, పారిశుద్ధ్యం, పౌష్ఠికాహారలోపం పై దృష్టి పెట్టాల్సి ఉంది. దేశీయ వైద్య విధానాలైన ఆయుర్వేదం, యునాని, హోమియోపతి లాంటి వాటికి తగిన నిధులు సమకూర్చి ఆయా విధానాలలో వైద్యుల నియామకం, మందులు ఏర్పాటుచేయాల్సి ఉంది.

ప్రజానిరసన లేకుండా ఏ ప్రభుత్వాలు తమ విధానాల నుండి దిగిరావు. రాజ్యాంగం ప్రసాదించిన 'అందరికి వైద్యం' అనేహక్కు కోల్పోతారో, లేక ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు వెళ్ళి అనవసరపు ఆపరేషన్లు పనికిమాలిన టెస్టులు, మందులువాడుతూ, ఇట్లా వాకిళ్ళు కోల్పోతూ, అవసరానికి శరీరావయవాలు అమ్ముకుంటూ, ఔషధ ప్రయోగశాలల్లో క్షేత్ర పరిశోధనల కింద బలవుతారో ప్రజలే నిర్ణయించుకోవాలి. ప్రజా ఉద్యమాల్లో పనిచేసే మేధావులు ఈ విషయమై తీవ్రంగా ఆలోచించి ప్రజలకు రాబోయే అనర్థాలను వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల వారు మాత్రమే ఈ రోజు విశృంఖలంగా స్థలాలు పొలాలు కొంటున్నారు. ఈ ఆసుపత్రులను పూర్తిగా జాతీయకరించి ప్రభుత్వ ఆసుపత్రులుగా మార్చడం ద్వారానే ప్రజలందరికి వైద్యం అందుతుంది. ఈ వైపుగా ప్రజలు తమ ఆగ్రహాన్ని పాలకులపై ఎక్కుపెట్టాలి.

మీ 'లోకవిద్య' ఇటువంటి పౌరసమాజాల నిర్మాణావశ్యకతను బలంగా సమర్థిస్తుంది.

**- ఐ. నాగేశ్వరరావు**

## రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకుల, కార్యకర్తల పాదయాత్ర

1. పెర్నేటి గంగ సుబ్బారావు, 69 సం॥లు
2. జగబత్తుని నాగేశ్వరరావు, 68 సం॥లు
3. వెంగల నాగేశ్వరమ్మ, 65 సం॥లు
4. భూదాటి సాంబయ్య, 62 సం॥లు
5. మాచర్ల మోహనరావు, 54 సం॥లు
6. దేవన వీరనాగేశ్వరరావు, 54 సం॥లు
7. మచ్చా మల్లేశ్వరి, 51 సం॥లు
8. కర్రా వెంకటేశ్వర్లు, 51 సం॥లు
9. సత్రం రమాకాంతం, 50 సం॥లు
10. గుత్తి సుబ్రమణ్యం, 49 సం॥లు
11. ఎర్రాప్రసాద్, 48 సం॥లు
12. సజ్జా శ్రీనివాసరావు, 48 సం॥లు
13. పెసల పోతరాజు, 47 సం॥లు
14. అచ్చుల పద్మ, 46 సం।లు
15. గుండారపు ఉప్పస్వామి, 46 సం॥లు
16. పూల వెంకటేశ్వర్లు, 45 సం॥లు
17. పట్టెం వెంకటేశ్వర్లు, 45 సం॥ల
18. చింతా సత్యనారాయణ, 45 సం॥లు
19. కొండా సూర్యచంద్ర, 42 సం॥లు
20. పంచుమర్తి కోటేశ్వరరావు, 36 సం॥లు
21. ముక్కర సుబ్బరావమ్మ, 33 సం॥లు
22. బీరక పరమేశ్వరరావు, 26 సం॥లు
23. కొచ్చర్ల ప్రేమకుమార్, 21 సం॥లు
24. చింతగింజల వెంకటేశ్వర్లు, 19 సం॥లు

**పాదయాత్ర విశేషాలు**

1. తెలంగాణ ప్రాంతంలో పనికి తగ్గ వేతనం రాకపోవడంతో చేనేత కుటుంబాలలో పిల్లలు పట్టణాలలో వాచ్‌మెన్‌లుగా, స్త్రీలు ఇళ్ళలో పని మనుషులుగా చేస్తున్నారు. నెలకు 10 వేల రూ॥లు ఆదాయం వస్తే అందరూ మగ్గాల పైనే పనిచేస్తామని చెప్పారు.
2. నల్గొండ జిల్లాలో సొసైటీలో పనిచేసే వారిలో కొద్దిమందికే మాత్రమే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. పైరవీలు చేసిన వారికే వస్తున్నాయి.
3. చేనేత జన సమాఖ్య గూర్చి చేనేత వృత్తిదారులందరికి తెలిసింది. వృత్తిదారులు, రైతులు కూడా చర్చలలో పాల్గొని చట్టపరంగా చీరలు, దోవతుల ఉత్పత్తి చేనేత రంగంలోనే చేయాలని సమర్థనగా ముందుకొచ్చారు. ప్రజల్లో చేనేత సమస్యలు పై మంచి స్పందన వుంది.
4. పాదయాత్ర సందర్భంగా చిత్తూరు, నల్గొండ, ప్రకాశం జిల్లాలలో చేనేత వృత్తిదారులు చేనేత సమస్యలపై ఆయా జిల్లాల కలెక్టర్లకు మెమోరాండం సమర్పించారు.
5. రాజకీయ పార్టీలలోని చేనేత కమిటీలలో పాదయాత్ర గూర్చి చర్చించి చేనేత రిజర్వేషన్లు, ఉత్పత్తి కేంద్రాలు, సంక్షేమ పథకాలపై ఆయా పార్టీల దృష్టికి వెళ్లింది.
6. పాదయాత్ర సక్రమంగా ప్రణాళిక ప్రకారం కాకుడా చేనేత గ్రామాలు తిరగడం కోసం 130 కి.మీ. అదనంగా (360 కి.మీ. అనుకుంటే 492 కి.మీ.) అయింది. అంతేగాక రోజుకు 20 కి.మీ కాకుండా 30 కి.మీ. అవడంతో అందరూ ఇబ్బందులు పడ్డారు.

**- లోకవిద్య ప్రతినిధి**

**ఈ పత్రికలోని వ్యాసాలు యధాతథంగా పునఃప్రచురణ హక్కులు అందరివి.**

**మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన**
**వెబ్ పేజీ** : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

**BOOK - POST PRINTED MATTER**
**1 MARCH - 2014**

To

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. A.P.- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.